క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఫిరంగిపురం: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు శాంతి అన్నారు. మండల కేంద్రంలోని రెండో సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా 104 సిబ్బందితో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 95మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 15మంది గర్భిణులకు షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ గోవర్ధన, ఆశ కార్యకర్తలు చిన్నమ్మాయి, ఆంథోనిరాణి, విజయ్‌కుమార్, సింగరాజులు పాల్గొన్నారు.

దేవస్థాన అభివృద్ధికి విరాళం



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి బెంగళూరుకు చెందిన భక్తులు మంగళవారం ఈఓ శ్రీనివాసరెడ్డికి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరు వాసులైన పల్లమాల భాస్కరావు, కుమార్తె ఉషశ్రీ అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి రూ.1.05 లక్షల చెక్కును అందజేసినట్లు తెలిపారు.

నాణ్యమైన మిర్చినారు అందించాలి



తాడికొండ: నర్సరీ యజమానులు సరైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ రైతులకు మేలైన నారును అందించాలని తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉద్యాన అధికారిణి పి.శిరీష సూచించారు. మంగళవారం తాడికొండ, మేడికొండూరు మండలాల పరిధిలోని రావెల, బండారుపల్లి, మందపాడు, సిరిపురం, పేరేచర్ల గ్రామాల్లోని నర్సరీలు, రైతు భరోసా కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో పలు రికార్డులు, రసీదు పుస్తకాలను పరిశీలించి తగు సూచనలు తెలియజేశారు. నాణ్యమైన మిర్చినారు ద్వారానే రైతులకు మేలైన దిగుబడులు వస్తాయని, నారు పెంపకంలో అజాగ్రత్త వహిస్తే సహించేది లేదన్నారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో సాగులో ఉన్న పంటలను గ్రామ ఉద్యాన సహాయకులు ఈ–క్రాప్‌లో నమోదు చేసి ఈకేవైసీ చేయాలని సూచించారు. ఏ ఒక్క ఎకరంలో పంట నమోదు కాకుండా చూడాలని, రైతులకు అందుబాటులో ఉండి అన్ని రకాల సేవలు అందజేయాలని సూచించారు. పలువురు ఉద్యాన విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

మంగళగిరి: మత్తు పదార్థాలు విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తాయని విద్యార్థులు వాటి జోలికి వెళ్లవద్దని డాక్టర్ బి.అనూష సూచించారు. నగరంలోని ఇందిరానగర్‌లోని నవజీవన్ బాలభవన్‌లో మంగళవారం మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనూష మాట్లాడుతూ మత్తుపదార్థాల అలవాటు భవిష్యత్తును పాడుచేస్తుందని గుర్తించుకోవాలన్నారు, కార్యక్రమంలో యూనిట్ ఆఫీసర్ శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్ జయలక్ష్మి కో–ఆర్డినేటర్ బి.రమేష్, ఎస్.యాకోబు రాజు పాల్గొన్నారు.

ప్రమాదాల బారిన పడకుండా పనిచేయాలి

గుంటూరు వెస్ట్: క్వారీలు, స్టోన్ క్రషర్స్‌లో పని చేసే కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డ్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సాసైటీ జ్ఞానేశ్వర్ తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక లక్ష్మీపురంలోని హోటల్లో భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కార్మికుల భద్రత కోసం డీజీఎంఎస్ హైదరాబాద్ రీజన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా క్వారీ, స్టోన్ క్రషర్ యజమానులు కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలన్నారు. వారికి పనిచేసే చోట ఫస్ట్ ఎయిడ్‌తోపాటు ప్రమాదాలు జరిగిన వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భారత ప్రభుత్వం కార్మికుల కోసం అనేక ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సాసైటీ సుప్రియా చక్రవర్తి, ఐఐటీ శాస్త్రవేత్తలు డాక్టర్ దేబరేష్ చక్రవర్తి, డాక్టర్ బిస్వజిత్ పాల్గొన్నారు.

సైకిల్‌పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తూ సైకిల్ నుంచి జారిపడి వ్యక్తి తీవ్ర గాయాలతో మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. జేకేసీ కళాశాల రోడ్డులో నివాసం ఉంటున్న చెరుకూరి సుబ్బారావు(50) ఫోటో ఫ్రేమ్ వర్క్ చేస్తున్నారు. సాయంత్రం జేకేసీ కాలేజ్ రోడ్డులో సైకిల్‌పై వస్తూ కిందపడ్డాడు. తలకు తీవ్రగాయం కావటంతో స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని తెలిపారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ థెరిస్సా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



ఎంఈఓ తెనాలి ఇందిరతో పాటు పలువురు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బెజ్జం సాయిప్రసాద్

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి
- ఎమ్మెల్సీ మురుగుడుతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ థెరిస్సా చిత్రపటాలకు నివాళి

మంగళగిరి: జీవితంలో గురువు పాత్ర విశేషమైనదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, మదర్ థెరిస్సా వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మానవుని జీవితంలో గురువు పాత్ర చాలా విశేషమైందని, జీవితంలో మనిషి ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు బాల్యం నుంచే గురువులు పునాదులు వేస్తారని అన్నారు. గురువులను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సమసమాజం రూపుదిద్దుకునేందుకు తల్లిదండ్రుల తరువాత ఆ స్థానం గురువులకు ఉంటుందని, అటువంటి గురువులు బోధించిన వాటిని జీవితాంతం అనుసరిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సేవే పరమావధిగా ఎంతో మంది అనాథలకు సేవ చేసి తన జీవితాన్ని ధారపోసిన గొప్ప మహనీయురాలు మదర్ థెరిస్సా అని కొనియాడారు. పరదేశం నుంచి వచ్చి భారతదేశ పౌరసత్వాన్ని స్వీకరించి తన జీవితాంతం ఈ దేశంలోని ఎంతో మంది పేదలకు సేవచేసి దేశానికే ఆదర్శంగా నిలిచిన మహోన్నతురాలన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ఆమె అడుగుజాడల్లో నడిచి పేదలకు సేవ చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మల్లవరపు సుధారాణి, కట్టెపోగు ఉదయ్ భాస్కర్, నాయకులు రేఖా వకుళాదేవి, దేవళ్ల సుబ్బారావు, రజక సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు, కొత్తపల్లి మోహనరావు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సెయింట్ ఆన్స్ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ నిర్మల

భావి పౌరులను తీర్చిదిద్దేది గురువులే..

ఫిరంగిపురం: భావిభారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేది గురువులేనని హెచ్‌ఎం సిస్టర్ నిర్మలా అన్నారు. మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో మంగళవారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక దివ్యమాత విద్యానికేతన్‌లో పాఠశాల కరస్పాండెంట్ రవికుమార్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. వేమవరంలోని ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం దివి కమల్ మోహన్ ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద హెచ్‌ఎం సిస్టర్ నిర్మల జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలవేసి నివాళులర్పించారు. కేకును కట్ చేసి, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మల హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

గురువులను గౌరవించడం అందరి బాధ్యత

తాడికొండ: సమాజానికి మార్గనిర్దేశకులైన ఉపాధ్యాయులను గౌరవించుకోవడం అందరి బాధ్యత అని తాడికొండ ఎంఈఓ తెనాలి ఇందిర అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బెజ్జం సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో తాడికొండ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వెస్ట్‌లో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు విద్యార్థి ఎదుగుదలకు బాటలు వేస్తారన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ తెనాలి ఇందిరతో పాటు ఉపాధ్యాయినులు పాలపర్తి ఇంద్రావతి, ఎ.కవితా సుహాసిని, పి.మంజుల, పి.చిన్నమ్మ, షేక్ దిల్షాద్ బేగంలను బెజ్జం సాయిప్రసాద్ ఘనంగా సత్కరించి మిఠాయిలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం...

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట ఉర్దూ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మంగళవారం తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం రవికుమార్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ జిలానీ, వైస్ చైర్‌పర్సన్ కరిమున్నీసా, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిర్మల హైస్కూల్‌లో...

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. అనంతరం జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ సిస్టర్ శౌరీలు మాట్లాడుతూ సమాజాన్ని మార్చి దేశాభివృద్ధికి దోహదపడే కొత్తతరాన్ని తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ కర్తవ్యంగా భావించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శిరీషా రాణి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థికి జపాన్ ఐటీ కంపెనీలో ఉద్యోగం



ముల్లా అబ్దుల్ ఖాదిర్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్‌యూ డీమ్డ్ యూనివర్సిటీలో ఈసీఈ చదువుతున్న ముల్లా అబ్దుల్ ఖాదిర్ అనే విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగం సాధించినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సారధివర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ ఉద్యోగాల కల్పనలో భాగంగా క్యాడ్ వంటి ప్రముఖ సాఫ్ట్‌వేర్‌లను అభివృద్ధి పరిచే సిస్టమ్ మ్యాట్రిక్స్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో రూ.26 లక్షల వార్షిక జీతంతో పాటు వసతి, ప్రయాణ ఖర్చులు వంటి పలు రకాల అలవెన్సులను కంపెనీ కల్పిస్తుందన్నారు. విజయవాడకు చెందిన ముల్లా అబ్దుల్ ఖాదిర్ తల్లిదండ్రుల సొంతూరు విజయవాడ అయినప్పటికీ ప్రస్తుతం వారు విదేశాలలో ఉంటున్నారని తెలిపారు. భాషా సమస్య లేకుండా ఉండటం కోసం వర్సిటీలో ఉన్న విదేశీ భాషల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థి ఖాదిర్‌కు జపాన్ భాషపై ప్రత్యేక శిక్షణనిస్తున్నట్లు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 'యూనివర్సల్' విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్ ఫాతిమా మర్రెడ్డి

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిప్రర్రు సమీపంలో ఉన్న యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కళాశాలలో కాన్సెప్ట్ గ్లోబల్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కంపెనీ హెచ్‌ఆర్ అనూష పర్యవేక్షణలో మూడు దశల్లో ఇంటర్వ్యూ నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మర్రెడ్డి తెలిపారు. మొదటి దశలో రాత పరీక్ష, వాటిలో ఉత్తీర్ణులైన వారికి రెండో దశ గ్రూప్ డిస్కషన్, వాటిలో ఉత్తీర్ణత సాధించిన వారు మూడో దశలో టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్ పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఎంపికల్లో విద్యార్థులు వెంకటసాయి, సుధా కిరణ్, షేక్ యాసిన్, అర్పిత్‌లు 8.5 ఎల్‌పీఏ ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించినట్లు వెల్లడించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవ.ఫాదర్ ఫాతిమా మర్రెడ్డి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండ



బాధితులకు ఆర్థిక సహాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలోని చిలువూరు గ్రామంలో 9 మంది బాధితులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సహాయం అందజేశారు. పలు అనారోగ్య సమస్యలతో బాధపడే వారితో పాటు మృతి చెందినవారి కుటుంబాలకు మంగళవారం ఒక్కొక్కరికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాధితులు అలపర్తి మహేష్, కాబోతు సందీప్, తాడిగిరి బాబూరావు, నెమలికంటి అనిత, మాలప్రోలు రవికుమార్, నెమలికంటి పెద సాంబయ్య,నల్లపు పూర్ణ, కోట నగేష్, కంచర్ల కోటేశ్వరరావులకు వైఎస్సార్ సీపీ నాయకులు నగదు అందజేశారు. ఎంపీపీ దానబోయిన సంషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజి, పార్టీ నాయకులు వడ్డేశ్వరపు రజనీకాంత్, దానబోయిన వెంకటేశ్వరరావు, యేసు రత్నం, జంషద్‌ఖాన్, నెమలికంటి బాబూరావు పాల్గొన్నారు.

రిక్షా బండి అందజేత

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ఆర్‌సీఎం చర్చి వద్ద నివాసం ఉండే ఓ రిక్షా కార్మికుడికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థికసాయంతో మంగళవారం రిక్షా బండి అందజేశారు. జేఏసీ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు మాట్లాడుతూ ఆర్‌సీఎం చర్చి వద్ద నివాసం ఉండే రిక్షా కార్మికుడు యర్రబాల ఆనందబాబుకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహకారంతో రిక్షా బండిని అందజేసినట్లు తెలిపారు. గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకట్రామిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న తెనాలి కార్యదర్శి బాబుప్రసాద్

తెనాలిఅర్బన్: నిరుద్యోగ నిర్మూలనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీపీఎం తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలోనిరుద్యోగం దేశంపై దాని ప్రభావం అనే అంశంపై చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం , అరకొర ఉపాధి రెండూ దేశానికి ప్రధాన శత్రువులని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే అంశాన్ని తెలియజేస్తుందన్నారు. కానీ నేటి పాలకులు దానిని విస్మరించారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న 9.82 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు కిరణ్, కె.కృష్ణకాంత్, రైతు సంఘం నాయకులు సాంబిరెడ్డి, సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, ఎస్.రాజ్యలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్ ఈశ్వర్, కె.సుభాష్, యోగేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణ చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ దోమలపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం సూచించారు. తెనాలి సాలిపేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలు దోమల ఉధృతికి కారణమన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమకాటు వలన మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధులు వస్తాయని చెప్పారు. వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. సమావేశంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ దివి కిషోర్ కుమార్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి డి.రాజునాయక్, యూనిట్ అధికారి వంగాల పున్నారెడ్డి, సిబ్బంది శివగణేష్, అందె బాలచంద్రమౌళి, రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి కలశాలు వితరణ



కలశాన్ని అందజేస్తున్న శివప్రసాద్, శ్రీనివాసబాబు

తెనాలి: పట్టణ కొత్తపేటలోని శ్రీవిరాట్ విశ్వకర్మ దేవస్థానంలో ఉప ఆలయాల పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి దుగ్గిరాలకు చెందిన ఎన్.శివప్రసాద్, చుక్కా శ్రీనివాసబాబులు నవగ్రహ మంటప కలశాన్ని సమర్పించారు. శివాలయ కలశాన్ని ఉదయశంకర్ సమకూర్చారు. ఆలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వీటిని దాతలు ఆలయ ఈవో మల్లీశ్వరి, అర్చకులకు అందజేశారు.దక్షిణ భారతదేశంలో తొలిసారిగా 1951లో కాశీ గోవిందమ్మ నిర్మించిన ఈ దేవస్థానంలో నవగ్రహాలు, శివమందిరం, దాసాంజనేయస్వామి ఉప ఆలయాలు ఉన్నాయి. ఉప ఆలయాల జీర్ణోద్ధరణలో భాగంగా ఈనెల 8వ తేదీన ఆరికట్ల గోవర్ధన శాస్త్రి ఆధ్వర్యంలో శ్రీగణపతి, కుమారస్వామి, కంచి కామాక్షి అమ్మవారు, శివాలయం, దాసాంజనేయస్వామి వార్ల పునఃప్రతిష్ఠ జరగనుంది. యలవర్తి ఆంజనేయ శాస్త్రి వేదపాఠశాల చైర్మన్ నూతలపాటి సురేష్, చుక్కా భానుప్రసాద్, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి వైద్య సామగ్రి



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సామగ్రిని మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన ప్రసాదం భోగలక్ష్మికుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకా సామగ్రిని అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎయిర్‌బెడ్, సెక్షన్ క్లీనింగ్ మిషన్, బి.పి.మిషన్, ఇతర మెడికల్ సామగ్రిని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా డాక్టర్ దిలీప్‌కు అందజేశారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి రాజేంద్రప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో తోట శ్రీకాంత్, పంది నారాయణ, గోపిశెట్టి ముసలయ్య, షేక్ కరీముల్లా, పాగర్తి శివయ్య, ఉన్నం జాన్‌బాబు, మోదుకూరి దావీదు, పఠాన్ నాగూర్ మీరా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిని గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్ : యువకుడిని గాయపరిచిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బ్రాడీపేటలో నివసించే మేరుగ పండు బాజారుకు వెళ్లి వస్తుండగా పరిచయం ఉన్న నాగ రాజు వచ్చి మా అబ్బాయిని ఎందుకు చెడగొడుతున్నావు పండు తలను ఆటోకేసి కొట్టాడు. దీంతో పండు తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు బాలికలకు రక్షణ కవచం 'దిశ'

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యూష

తెనాలిరూరల్: 18 ఏళ్ల లోపు కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని మహిళా న్యాయవాది పేట ప్రత్యూష తెలిపారు. స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో మంచి చెడు స్పర్శలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు మంచి చెడు స్పర్శల గురించి అదే విధంగా యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి వివరిస్తూ అవగాహన కల్పించారు. న్యాయవాది ప్రత్యూష మాట్లాడుతూ కిశోర బాలికలు మంచి చెడు స్పర్శలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అపరిచిత వ్యక్తులే కాకుండా తెలిసిన వారుసైతం బాలికలతో చెడుగా ప్రవర్తించే సందర్భాలు ఉంటాయని, అలాంటి ఘటన ఎదురైతే వెంటనే సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయంలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ కవచంగా వున్న దిశ యాప్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, మహిళా పోలీసులు సరిత. అనుజ్ఞ, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎన్.హేమలత, విద్యార్థినులు పాల్గొన్నారు,

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి



డ్రెయినేజీ సమస్యలను పరిశీలిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. ఈక్రమంలో మంగళవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాన్నూరు రోడ్డు, బారాఇమాంపంజా రోడ్డు, సమాధుల రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సైడ్ కాల్వలు, రోడ్లు పరిశీలించి పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలమయంగా మారవడంతో వారికి మరమ్మతులు చేయించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో వర్షపు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు డ్రెయినేజీ శుభ్రం చేయాలని సూచించారు. స్థానికంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు నూరిఫాతిమా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అధికారులకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.